సాక్షి
వికారాబాద్
గురువారం । 13 । మార్చి । 2025




బండరాళ్లమయం

దుద్యాల్ మండలం చిలుముల మైల్వార్ గ్రామంలోని క్రీడాప్రాంగణం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. 8లో▸



రాగుల సాగు.. భలే బాగు

ప్రధాన ఆహార పంటల్లో రాగి ఒకటిగా చెప్పొచ్చు. చిరు ధాన్యం పంటగా రాగులను పండిస్తారు. 8లో▸



న్యూస్‌రీల్

డిజిటల్ లావాదేవీలపై అవగాహన అవసరం

రిజర్వ్ బ్యాంక్ అధికారులు రెహమాన్, సావిత్రి



డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రిజర్వ్ బ్యాంక్ అధికారులు

దోమ: డిజిటల్ లావాదేవీలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని రిజర్వ్ బ్యాంక్ అధికారులు రెహమాన్, సావిత్రి అన్నారు. బుధవారం దోమ మండలం దొంగఎన్కేపల్లి గ్రామంలో డిజిటల్ లావాదేవీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ..మార్చి 10 నుంచి 16వ తేదీ వరకు డిజిటల్ లావాదేవీలపై ప్రతి బ్యాంక్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్లు తెలిపారు.బ్యాంకులు సూచించిన యాప్ ల ద్వారానే లావాదేవీలు జరుపుకోవాలన్నారు. నగదు రహిత లావాదేవీలు చేసే క్రమంలో సైబర్ నేరగాళ్ల బారిన పడే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సీనియర్ బిజినెస్ మేనేజర్ విజయేందర్, పరిగి టీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

హిస్టరీ లెక్చరర్‌గా బ్రాహ్మిణి



నియామక పత్రంతో బ్రాహ్మిణి

బొంరాస్‌పేట: మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో ఎస్జీటీగా పనిచేస్తున్న పి.బ్రాహ్మిణి బుధవారం రవీంద్రభారతిలో జూనియర్ లెక్చరర్‌గా నియామక పత్రం అందుకున్నారు. చరిత్ర (హిస్టరీ) సబ్జెక్టులో మహిళా అభ్యర్థులలో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు సాధించారు. నల్గొండ జిల్లాకు చెందిన బ్రాహ్మిణి 2017లో టీచర్ ఉద్యోగం పొందారు. 317జీవోలో భాగంగా వికారాబాద్ జిల్లాలో నియామకమై తాజా బదిలీల్లో మండలంలోని చౌదర్‌పల్లి ఎంపీపీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం నగరంలోని మహబూబియా కళాశాలలో హిస్టరీ జూనియర్ లెక్చరర్‌గా అపాయింట్‌మెంట్ ఆర్డర్ తీసుకున్నారు. బ్రాహ్మిణికి పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎల్.శశిధర్, హెచ్‌ఎం పరమేశ్వరి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శ్రీప్రియ, నవీన్‌కుమార్ అభినందనలు తెలిపారు.

గ్రూప్ -1 ఫలితాల్లో సత్తా చాటిన సస్యరెడ్డి



బంట్వారం: ఇటీవల విడుదలైన టీజీపీఎస్సీ గ్రూప్ -1 పరీక్ష ఫలితాల్లో కోట్‌పల్లి మండలం మోత్కుపల్లికి చెందిన కేరెల్లి సస్యరెడ్డి సత్తా చాటారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి 462.5 మార్కులు సాధించారు. సస్యరెడ్డి ఢిల్లీ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం ఎంఏ పొలిటికల్ సైన్స్ చదువుతోంది. తల్లిదండ్రులు వెంకట్‌రెడ్డి, శ్యామలత ప్రోత్సాహంతో మొదటి ప్రయత్నంలోనే గ్రూప్-1 ఉద్యోగానికి ఎంపికైంది. తండ్రి వ్యవసాయం చేస్తూ పిల్లల్ని చదివిస్తున్నారు. కూతురు గ్రూప్-1 పరీక్షలో సత్తా చాటినందుకు సంతోషం వ్యక్తం చేశారు.

విద్యారంగానికి పెద్దపీట వేయాలి

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

అనంతగిరి: త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం వికారాబాద్ పట్టణంలోని ఏబీవీపీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. మన రాష్ట్రంలో అరకొర నిధులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాల రిషిప్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మురళీ, దయాకర్, సాయికిశోర్, రామ్, కార్తీక్, మహేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



పరిగి మండలం సయ్యద్‌పల్లి సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మనమే టాప్

ఉపాధి హామీ పనుల్లో అగ్రస్థానంలో జిల్లా

- ఈ ఏడాది కల్పించాల్సిన పని దినాలు 67.37లక్షలు
- ఇప్పటి వరకు కల్పించింది 59.71లక్షలు
- జిల్లాలో జాబ్‌కార్డులు 1.86లక్షలు
- కూలీల సంఖ్య 3.77లక్షలు
- గత నెలతో పోలిస్తే 22 వేల మందికి అదనంగా పనులు

వికారాబాద్: జిల్లాలో ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. గత నెలతో పోలిస్తే ఈ నెలలో 22 వేల మంది కూలీలకు అదనంగా పనులు కల్పించారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతోపాటు డీఆర్డీఓ నిరంతర పర్యవేక్షణ, సమీక్షలు కూలీల సంఖ్య పెరగడానికి దోహదం చేస్తున్నాయి. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం పనులు చేపడుతున్న 32 జిల్లాల్లో మనం ముందు వరుసలో ఉన్నాం. నిత్యం పనులకు హాజరవుతున్న కూలీల సంఖ్య పరంగా చూస్తే మన జిల్లా మొదటి స్థానంలో కొనసాగుతోంది. కూలీల సగటున చూస్తే రెండో స్థానంలో ఉంది. వ్యవసాయ పనులులేని కాలంలో వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం 2008లో దేశవ్యాప్తంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి అప్రతిహతంగా కొనసాగుతున్న ఈ పథకంలో ప్రతి సంవత్సరం వేలాదిమంది ఉపాధి పొందుతున్నారు. గతేడాది కూడా రాష్ట్రంలో ఉపాధి హామీ పనుల కల్పనలో మనం మొదటి స్థానంలో నిలువగా ఈ ఏడాది కూడా కూలీలు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. ఒకప్పుడు కొన్ని పనులకే పరిమితమైన ఈ పథకం ప్రస్తుతం 50 రకాలకు పైగా పనులు చేసుకోవడానికి విస్తరించారు. వ్యవసాయ అనుబంధ పనులు,పొలం గట్ల వెంబడి మొక్కలు నాటడం, ఇంకుడు గుంతలు తవ్వకోవడం, పాఠశాల క్రీడా మైదానాల చదును చేయడం, ఫాంపాండ్స్ నిర్మాణాలు, పశువులు, గొర్రెలు, మేకల కోసం పాకలు నిర్మించుకోవడం, మట్టి రోడ్లు వేసుకోవడం, పొలాల్లో వర్షపు నీటి నిల్వకు రాతి, మట్టి కట్టలు ఏర్పాటు చేసుకోవడం.. ఇలా ఎన్నో పనులు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నారు.

రూ.142 కోట్ల చెల్లింపులు

జిల్లాలో 1,86,197 జాబ్‌కార్డులు ఉండగా..3,77,087మంది కూలీలు ఉన్నారు.ప్రస్తుతం 32,832 మంది పనులకు వస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 6,73,7496 లక్షల పనిదినాలు (మ్యాన్ డేస్) కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటి వరకు 5,97,1480 లక్షల పని దినాలు కల్పించారు. ఇందుకు సంబంధించి కూలీలకు రూ.142కోట్లు చెల్లించారు.గత నెలలో రోజూ దాదాపు 10 వేల మంది కూలీలు పనులకు రాగా ఈ నెల వీరి సంఖ్య22 వేలకు పెరిగింది.ప్రస్తుత పరిస్థితుల్లో కూలి గిట్టుబాటు కావటం లేదని కూలీలు అంటున్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచడానికి గ్రామీణాభివృద్ధి శాఖ ఏర్పాట్లు చేస్తోంది. గతంలో పంపిణీ చేసిన షెడ్ నెట్స్, ఫస్ట్ ఎయిడ్ కిట్లు శ్రమశక్తి సంఘాల వద్ద అందుబాటులో ఉన్నాయి. అయితే వీటిని క్షేత్రస్థాయిలో ఉపయోగించడంలేదు.

వేతనాలు అందక..

జిల్లాలో డీఆర్డీఏ శాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన 200 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరికి వేతనాలు సక్రమంగా అందడం లేదు. అటెండర్లు, సీసీలు, ఏపీఓలు, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఏపీఎంలు తదితరులు విధుల్లో ఉన్నారు. నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదని వాపోతున్నారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. పదేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న వారందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు.

పంచాయతీల నుంచి వసతులు

జిల్లాలో 32వేల మంది ఉపాధి పనులు చేస్తున్నారు. వారికి గతంలో షెడ్ నెట్స్, ఫస్టఎయిడ్ బాక్సులు అందజేశాం. వాటి లైఫ్ తక్కువగా ఉంటుంది. గ్రామ పంచాయతీల్లోని గ్రీన్ బడ్జెట్ నుంచి వసతులు కల్పించాలని ప్రభుత్వం చెబుతోంది. సాంకేతిక సమస్యల కారణంగా ఉపాధి హామీ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు రావడం లేదు. త్వరలో ఈ సమస్య పరిష్కారమవుతుంది.

– శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

మెరుగైన బోధన జరగాలి

- మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి
- గురుకులాలను తనిఖీ చేసిన అధికారులు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి

తాండూరు టౌన్: గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన బోధన, సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి అన్నారు. బుధవారం ఆయన పట్టణ శివారులోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల, బాలుర గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే జినుగుర్తి పరిధిలోని కేజీబీవీ గురుకుల పాఠశాలను మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, పట్టణంలోని సాయిపూర్ గిరిజన బాలికల వసతి గృహాన్ని ఆర్ఐ అశోక్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో అందుతున్న వసతులు, సౌకర్యాలు, తాగునీరు, భోజనం తదితర విషయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట గది, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి అధికారులు భోజనం చేశారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉత్తమ బోధనతో పాటు నాణ్యమైన భోజనం, వసతులను కల్పిస్తోందన్నారు. గురుకులాల నిర్వాహకులు విద్యార్థులకు ఎలాంటి లోటు లేకుండా చూసుకోవాలన్నారు. నాణ్యమైన భోజనం అందించడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచండి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి

- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి
- ఎరువుల దుకాణాల డీలర్లతో సమావేశం
- వ్యవసాయ చట్టాలపై అవగాహన ఉండాలని సూచన

కొడంగల్ రూరల్: రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి డీలర్లకు సూచించారు. బుధవారం మండలంలోని పర్సాపూర్ రైతు వేదికలో డివిజన్‌లోని ఎరువుల దుకాణాల డీలర్లకు వ్యవసాయ చట్టాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందు కొనుగోలు చేసే రైతులకు బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించరాదని, లేబుల్ లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు ఉంటాయన్నారు. అనుమతి లేని విత్తనాలు, నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా డీలర్లు అధికారులకు సహకరించాలని కోరారు. విత్తనాలను అక్రమంగా నిల్వ చేసినా, రవాణా చేసినా, ప్యాకెట్ లేకుండా లూజుగా అమ్మినా జరిమానా తోపాటు శిక్ష తప్పదన్నారు. రైతులను మోసం చేస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. స్టాక్‌కు సంబంధించి ఎప్పటికప్పుడు రికార్డులు నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ శంకర్ రాథోడ్, మండల వ్యవసాయాధికారులు జి.తులసి, హిమబిందు, ఏఈఓలు రాజు రాథోడ్, అశ్విని, డీలర్లు పాల్గొన్నారు.



చింతకుంట గ్రామంలో పశువుల నీటి తొట్టిని పరిశీలిస్తున్న డీపీఓ జయసుధ

పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు తీసుకోండి

- డీపీఓ జయసుధ

ధారూరు: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని డీపీఓ జయసుధ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండలంలోని చింతకుంట, కేరెళ్లి గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లోని డంపింగ్‌యార్డులు, వర్మీ కంపోస్టు యూనిట్లు, మొక్కల పెంపకాన్ని పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పశువుల తాగునీటికి ఇబ్బంది రాకుండా చూసుకోవాలన్నారు. తొట్లలో నీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రెండు పంచాయతీల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ షఫీఉల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దైవ ఉద్యమానికి సహకరించండి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును కోరిన రంగరాజన్



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: దైవానికి రాజ్యాంగ బద్ధమైన అధికారాల కోసం చిలుకూరు బాలాజీ ఆలయం నుంచి జరుగుతున్న ఉద్యమానికి సహకరించాలని అర్చకుడు రంగరాజన్.. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును కోరారు. ఈ మేరకు బుధవారం నగరంలోని వెంకయ్యనాయుడు నివాసంలో ఆయనను కలిసి విన్నవించారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం అందజేసి ఆశీర్వచనం ఇచ్చారు. దేశంలో రామరాజ్య పునఃస్థాపన రాజ్యాంగబద్ధంగా జరగాలని.. సుప్రీం కోర్టుకు తన పరిధి గురించి తెలిపేవిధంగా పిటిషన్స్ కమిటీ రఘురామకృష్ణకు సమర్పించిన లేఖ గురించి వెంకయ్యనాయుడుకు వివరించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని రంగరాజన్ తెలిపారు.

ఇంటి నుంచే సదరం స్లాట్స్

ఇబ్రహీంపట్నం రూరల్: దివ్యాంగులకు మరింత ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వం ముందుకు సాగుతోందని డీఆర్‌డీఓ శ్రీలత అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో దివ్యాంగులకు యూనిక్ డిజేబులిటీ ఐడీ కార్డు (యూడీఐడీ) జారీపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సదరం సర్టిఫికెట్ల జారీకి గతంలో ఏడు రకాల వికలత్వాలకు మాత్రమే అవకాశం ఉండేదని.. ప్రస్తుత ప్రభుత్వం మరో 14 వికలత్వాలను కలిపి మొత్తం 21 రకాలను చేసిందన్నారు. గతంలో సదరం స్లాట్స్ బుకింగ్ మీ సేవలో మాత్రమే వెసులుబాటు ఉండేదన్నారు. యూడీఐడీ ద్వారా ఇంటర్‌నెట్ సౌకర్యం ఉంటే ఇంటినుంచే స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చునని వివరించారు. రంగారెడ్డి జిల్లాలో వనస్థలిపురం ఆస్పత్రి, గాంధీ ఆస్పత్రిని యూడీఐడీకి కేటాయించడం జరిగిందన్నారు.

రేపే హోలీ

- రంగుల పండుగకు యువత సిద్ధం
- రసాయనాలతో ముప్పు తప్పదంటున్న వైద్యులు
- సహజ రంగులు మేలని సూచన



తాండూరు: రంగుల పండుగ హోలీ రానేవచ్చింది. వేడుకలు ఆనందంగా జరుపుకొనేందుకు చిన్నారులు, యువతీయువకులు, పెద్దలు సిద్ధమయ్యారు. అయితే రంగుల విషయంలో జాగ్రత్తలు పాటించక పోతే ప్రమాదం తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శుక్రవారం హోలీ పండుగ సందర్భంగా ప్రత్యేక కథనం..

సహజ రంగులు మేలు

హోలీ సందర్భంగా రసాయన రంగుల వాడితే చర్మం, కళ్లకు ముప్పు.సహజ సిద్ధ రంగులు (హెన్నా, పసుపు, కుంకుమ, చందనం, బుక్క గులాలు, మోదుగ పూలతో తయారు చేసిన రంగులు, టమాట గింజలతో తయారు చేసిన పొడి) వాడితే చర్మానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. అంతేకాకుండా చర్మ వ్యాధుల నుంచి ఈ రంగులు రక్షణ కల్పిస్తాయి.

రసాయనాలు వద్దు

రంగుల తయారీలో ప్రాణాంతక రసాయనాలను వాడతారు. వాటిని ఉపయోగించడం వల్ల చర్మ సంబంధిత వ్యాధులు వస్తాయి. కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంది.

నీటి వృథాను అరికట్టాలి

రంగుల్లో అపరిశుభ్రమైన నీటిని కలిపి చల్లుకోవడం వల్ల చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. పట్టణాల్లో నీటి ఎద్దడి ప్రారంభమైన తరుణంలో హోలీ పేరిట నీటిని వృథా చేయరాదని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. హోలీ ఆడిన తర్వాత స్నానానికి చెరువుల్లోకి వెళ్లే యువత జాగ్రత్తలు పాటించాలి. ఈత రాకుంటే చెరువుల్లోకి దిగరాదు. జలాశయాల వద్ద పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేయాలి.

ఈ సూచనలు పాటించాలి

- ఒక వేళ హోలీ వేడుకల్లో రసాయన రంగులను వాడాల్సి వస్తే అవి శరీరంపై ఎక్కువ సేపు ఉండకుండా చూసుకోవాలి.
- ఎరుపు, పింగ్ కలర్ రంగులు వాడితే మంచిది. ఇవి తక్కువ గాఢత కలిగి ఉంటాయి. శరీరం పైనుంచి సులభంగా తొలగిపోతాయి. గ్రీన్, ఆరెంజ్, పసుపు రంగులు ఎక్కువ రసాయనాలను కలిగి ఉంటాయి. ఆ రంగులను శరీరం పైనుంచి తొలగించడం కష్టం.
- హోలీ ఆడటానికి ముందు ముఖానికి నూనె రాసుకోవడం మంచిది. ఇలా చేయడం వల్ల రంగులు శరీరంలోకి ఇంకవు. శుభ్రం చేయడం కూడా సులభతరం.
- ముఖంపై పడిన రంగులను శుభ్రం చేసుకోవడానికి సబ్బు కన్నా షాంపో వాడటం మంచిది.
- రంగులకు పలు రకాల ఆయిల్ కలిపి శరీరానికి రాస్తుంటారు. ఇలా చేయడం వల్ల వాటిని శుభ్రం చేయడం కష్టం. ఎక్కువ నీటిని వినియోగించాల్సి ఉంటుంది.

జాగ్రత్తలు పాటించాలి



రంగులు చల్లుకునేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. చిన్నారులు హోలీ ఆడే సమయంలో తల్లిదండ్రులు దగ్గరుండి చూసుకోవాలి. ఒక వేళ రంగులు కళ్లల్లో పడితే వెంటనే శుభ్రం చేయాలి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున మధ్యాహ్నం 12 గంటల లోపు హోలీ వేడుకలు ముగించాలి.

– డాక్టర్. రవిశంకర్, సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి, తాండూరు

వడివడిగా అడుగులు..

- కొంగర కుర్దులో ఏఐ సిటీ..
- తిమ్మాయిపల్లిలో ఐటీ పార్కు
- 625 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్
- ఫోర్త్‌సిటీ అభివృద్ధి పనులు చకచకా

సాక్షి, రంగారెడ్డి: ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌సీడీఏ)ను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆ ప్రాంతంలో కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు భూ సేకరణ ప్రక్రియ మొదలుపెట్టింది. ఈ నేపథ్యంలో తాజాగా 625 ఎకరాలను సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. వేర్వేరు చోట్ల గుర్తించిన భూముల్లో ఒకచోట ఏఐ సిటీని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తోంది. మరో చోట ఇతర ఐటీ కంపెనీల హబ్‌గా తీర్చేదిద్దేలా ప్రతిపాదనలు తయారు చేసింది. ఫ్యూచర్ సిటీ కోసం ప్రత్యేక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్న పట్టణాభివృద్ధి సంస్థ.. ఫార్మా, ఐటీ, లైఫ్ సైన్సెస్, స్పోర్ట్స్ హబ్ లకు స్థలాలను నిర్దేశించింది. ఇటీవల నాగిరెడ్డి ప ల్లిలో భూ సేకరణ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభు త్వం తాజాగా మహేశ్వరం, కందుకూరు మండలాల్లోనూ మరికొంత భూమిని సమీకరిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే గ్రీన్‌ఫీల్డ్ రహదారికి భూ సేకరణ చేస్తున్న సర్కారు.. ప్రాజెక్టుల స్థాపనకు అవసరమైన భూ సేకరణ చేపడుతోంది. భూ లభ్యతపై క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ యంత్రాంగం.. అసైన్డ్ భూముల వివరాలను సేకరిస్తోంది.

ఐటీ, పారిశ్రామిక పార్కుల కోసం..

మహేశ్వరం మండలం రావిర్యాల పరిధిలోని కొంగరకుర్దు సర్వే నంబర్ 289లోని 94 మంది రైతుల నుంచి 275.12 ఎకరాలు సేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ భూముల్లో ఐటీ, ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేయనున్నట్లు అందులో పేర్కొంది. అయితే.. ప్రతిపాదిత భూములను ఏఐ సిటీకి కేటాయించనున్నట్లు తెలిసింది. 200 ఎకరాల విస్తీర్ణంలో ఈ సిటీని అభివృద్ధి చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రతిపాదిత రతన్ టాటా గ్రీన్‌ఫీల్డ్ రహదారికి సమీపంలోని అసైన్డ్ భూములను సేకరించి.. ఏఐ సిటీకి కేటాయించనున్నట్లు తెలుస్తోంది. అలాగే.. కందుకూరు మండలం తిమ్మాయిపల్లి సర్వే నంబర్ 9లోని 439 మంది రైతుల నుంచి 350.22 ఎకరాల భూమిని సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది.

రోడ్డుకు ఇరువైపులా హద్దురాళ్లు..

మీర్‌ఖాన్‌పేట వద్ద యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీకి శంకుస్థాపన చేసిన ప్రభుత్వం.. భవన నిర్మాణ పనులను మేఘా సంస్థకు అప్పగించింది. పనులు చకచకా సాగుతున్నాయి. మరో వైపు ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్ పేట మీదుగా ఆర్ఆర్ఆర్ వరకు 300 ఫీట్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి భూ సేకరణ చేపట్టింది. దారి పొడవునా.. రోడ్డుకు ఇరువైపులా హద్దురాళ్లను పాతే పనిలో నిమగ్నమైంది.

క్లుప్తంగా

నిర్మాణ రంగంలో భారతి సిమెంట్ ప్రత్యేకం


మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లను అందిస్తున్న సామ్రాట్ తదితరులు

పూడూరు: నిర్మాణ రంగంలో భారతి సిమెంట్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ సామ్రాట్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మన్నెగూడలో మదీన ట్రేడర్స్‌లో తాపీమేస్త్రీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి సిమెంట్ నాణ్యమైందన్నారు. నిర్మాణ పక్రియలో అల్ట్రాఫాస్ట్ తొందరగా సెట్టింగ్ అవుతుందని తెలిపారు. అల్ట్రాఫాస్ట్‌తో స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రోడ్లకు సంబంధించిన పనులకు వాడితే దృఢంగా ఉంటాయన్నారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ అక్బర్, తాపీమేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

పది ఫోన్ల రికవరీ


సెల్‌ఫోన్‌లను అందజేస్తున్న సీఐ

అనంతగిరి: సీఈఐఆర్ యాప్ సాయంతో పది మంది బాధితులకు సెల్‌ఫోన్లు అందచేసినట్లు వికారాబాద్ సీఐ భీంకుమార్ తెలిపారు. బుధవారం ఆయన వికారాబాద్ ఠాణా పరిధిలో సీఎస్ఐఆర్ యాప్‌తో 10 మంది సెల్ రికవరీ చేసి అందించామన్నారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వాళ్లు వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

కుక్క దాడిలో నలుగురు చిన్నారులకు గాయాలు


కుక్క కాటుతో గాయపడిన చిన్నారి

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. బుధవారం గిరిగేట్‌పల్లిలో చౌరస్తా వద్ద ఉదయం 8.30 గంటల సమయంలో గ్రామానికి చెందిన పలువురు చిన్నారులు పట్టణ కేంద్రంలోని తమతమ స్కూళ్లకు వెళ్లేందుకు బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ఈక్రమంలో ఓ కుక్క ఒక్కసారిగా వచ్చి అక్కడ నిల్చున్న నలుగురు చిన్నారులపై దాడి చేసి, కరిచింది. వీరిని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. ఇదిలా ఉండగా గ్రామంలో కుక్కలను నియంత్రించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మేస్త్రీ మృతి


ఘటనా స్థలిలో సుధాకర్ మృతదేహం

యాలాల: రోడ్డు ప్రమాదంలో ఓ మేస్త్రీ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోనలి రాఘవపూర్ శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. బొంరాస్‌పేట మండలం మెట్లకుంటకు చెందిన సుధాకర్(30) మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. బుధవారం తాండూరు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా రాఘవాపూర్ దాటాక రోడ్డు పక్కన రక్తపు మడుగులో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడి వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందా..? అడవి పంది అడ్డొచ్చిందా అంటూ అనుమానం వ్యక్తం చేశారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు.

దివ్యాంగ సమస్యలపై చర్చించండి


మాట్లాడుతున్న నాయకులు

అనంతగిరి: అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాల్లో దివ్యాంగుల సమస్యలపై చర్చించేందుకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ చొరవ చూపాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు సుధీర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్‌లోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దివ్యాంగులు రాష్ట్ర వ్యాప్తంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం వెంటనే సభలో చర్చించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.6వేల పెన్షన్ ఇస్తామన్న హామీ ఇప్పటికీ నెరవేరలేదన్నారు. వెంటనే అధిక పింఛను ఇచ్చి న్యాయం చేయాలన్నారు. సమావేశంలో చంద్రయ్య, చుక్క య్య, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం.. బండరాళ్లమయం


చిలుములు మైల్వార్ గ్రామంలో నిరుపయోగంగా క్రీడా ప్రాంగణం

గ్రామీణ యువత, విద్యార్థులు క్రీడల్లో రాణించాలనే సదుద్దేశంతో గతంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆహ్లాద వాతావరణంతో చిన్నారులకు తర్ఫీదును ఇవ్వాల్సిన ప్రాంగణాలు కొన్నిచోట్ల ఊరికి దూరంగా బండరాళ్లు, గుట్టల నడుమ క్రీడలకు ఏ మాత్రం ఆమోదయోగ్యం లేకుండా వెలవెలబోతున్నాయి.

- ఊరికి దూరంగా ఆట స్థలం కేటాయింపు
- వెళ్లలేక అవస్థలు పడుతున్న విద్యార్థులు, యువకులు

దుద్యాల్: ప్రతి గ్రామంలోని యువత, విద్యార్థులు ఆటలపై ఆసక్తి పెంచుకునేందుకు గత ప్రభుత్వ హయాంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో వాటిని స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయగా, మరికొన్నింటిని బడికి సమీపంలోని స్థలం చూసి విద్యార్థులకు ఉపయుక్తంగా నెలకొల్పారు. అందులో మండల పరిధిలోని చాలా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఊరికి దూరంగా ఖాళీ స్థలాల్లో ఏర్పాటు చేయడంతో నిరుపయోగంగా మారాయి. మండల పరిధిలోని చిలుముల మైల్వార్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఊరిలో ఉంటే.. క్రీడా ప్రాంగణము రెండు కిలో మీటర్ల దూరంలోని అడవిలో ఏర్పాటు చేశారు. పైగా అందులో పెద్ద పెద్ద బండరాళ్లు ఉన్నాయి. దీంతో ఆటలు ఆడేందుకు యోగ్యం లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

చెట్ల పొదలతో ఇబ్బంది

చిలుముల మైల్వార్ గ్రామం అటవీ ప్రాంతంలో ఉన్న మామిడికుంట ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లే మార్గ మధ్యలో ఈ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. చుట్టుముట్టూ చెట్ల పొదలు, గుట్టలతో భయంకరంగా ఉందని గ్రామ యువకులు వాపోతున్నారు. దీంతో క్రీడా ప్రాంగణం నిరుపయోగంగా మారింది. ఆటలు ఆడుకోవడానికి అనువైన స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాన్ని గ్రామ సమీపంలోకి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆటలకు దూరంగా..



పాఠశాలకు క్రీడా ప్రాంగణం లేకపోవడంతో ఆటలకు దూరంగా ఉంటున్నాము. మిగతా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మాత్రం మండల, జిల్లా స్థాయిలో క్రీడల్లో రాణిస్తున్నారు. మాకు క్రీడా ప్రాంగణం ఉంటే శిక్షణ తీసుకొని ఆటల్లో సత్తా చూపేవాళ్లం.

– యోగేశ్, విద్యార్థి, 8వ తరగతి

అక్కడికి వెళ్లాలంటే భయం



క్రీడా ప్రాంగణం పాఠశాలకు దగ్గర ఉంటే అన్ని క్రీడలు నేర్చుకునే వాళ్లం. కానీ గ్రామానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉండడం, చుట్టుముట్టూ అటవీ ప్రాంతం కావడంతో అక్కడికి వెళ్లాలంటే చాలా భయం. దీంతో క్రీడలకు మాకు చాలా దూరం పెరిగింది.

– నందిని, విద్యార్థిని, 8వ తరగతి

నాణ్యమైన భోజనం ఇవ్వాలి

తాండూరు మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి


కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

తాండూరు రూరల్: మెనూ ప్రకారం కేజీబీవీ విద్యార్థినులకు భోజనం అందడం లేదని తాండూరు మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశాల మేరకు ఆయన మండలంలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న కేజీబీవీని ఆయన తనిఖీ చేశారు. పాఠశాల, కళాశాలలో తరగతి గదులు, వంటగదితో పాటు బియ్యాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థినులకు డైనింగ్ హాల్ లేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తించారు. నలుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకొని వైద్యం అందించాలని ఎస్ఓకు ఆదేశించానన్నారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ ఆశలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఆర్థిక సమస్యలతో మహిళ ఆత్మహత్య


పావని (ఫైల్)

నవాబుపేట: ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన బుధవారం ఉదయం మండలంలోని నారెగూడలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోషనొళ్ల పావని(30) భర్త పరమేష్‌తో కలిసి కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. తమకున్న ఎకరం పొలంతో పాటు అదే గ్రామానికి చెందిన ఓ రైతు పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. కొంత కాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం వేకువజామున బహిర్భూమికి వెళ్లిన పావని ఎంతకు రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబసభ్యులు వెతికారు. పొలంలోని బావి వద్ద ఆమె చెప్పులు, స్కార్ఫ్ ఉండడంతో మోటార్ల సహాయంతో నీటిని తోడేశారు. అందులో పావని మృతదేహం బయటకు తేలింది. మృతురాలి తండ్రి భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ అరుణకుమార్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కొడుకులు పురుషోత్తం(8), విఘ్నేశ్వర్ (6) ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేకి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

అనంతగిరి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ అన్నారు. ఈమేరకు బుధవారం వికారాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు వ్యతిరేకంగా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025 ఫిబ్రవరి ఒకటిన ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక వైఖరి మరోసారి వెల్లడయిందన్నారు. దేశంలో ఉన్న సామాన్య ప్రజలు, కార్మిక వర్గంపై అనేక భారాలు మోపుతూ కార్పొరేట్‌కు వత్తాసు పలుకుతుందని ఆరోపించారు. ఉపాధి హామీకి నిధుల కోత పెట్టిందన్నారు. ఉద్యోగాల భర్తీకి ఎలాంటి ప్రణాళికలేవన్నారు. బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండి చేయి చూపిందన్నారు. కార్మిక లోకంకు చేస్తున్న అన్యాయాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వెంకటయ్య, చంద్రయ్య, రామకృష్ణ, బుగ్గప్ప, మంగమ్మ, ఉమాదేవి, యాదమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

మహిళను ఏమార్చి నగదు అపహరణ


పంక్చర్ అయిన కారు వద్ద బాధితురాలు శారద

రూ.1.29 లక్షల నగదు కొట్టేసిన కేటుగాడు

తాండూరు టౌన్: మహిళను ఏమార్చి ఓ దొంగ నగదును కొట్టేశాడు. నడిరోడ్డుపై బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనతో జనాలు అవాక్కయ్యారు. క్షణాల వ్యవధిలో నగదు చోరీ గురికావడంతో చేసేదేమి లేక పోలీసులను ఆశ్రయించారు ఆ దంపతులు. వివరాలిలా ఉన్నాయి. బొంరాస్‌పేట మండలం తెట్టికుంట తండాకు చెందిన రాజు, శారద దంపతులు తమ పాపతో కలిసి కారులో తాండూరుకు బుధవారం వచ్చారు. శారద తల్లికి అనారోగ్యంగా ఉండటం, చికిత్స నిమిత్తం డబ్బులు అవసరం పడటంతో పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో బంగారం తాకట్టు పెట్టి రూ.1.29 లక్షల నగదును తీసుకున్నారు. అనంతరం సమీపంలో ఉన్న మెట్రోమనీలా హోటల్‌లో భోజనం చేశారు. వచ్చి చూసే సరికి కారు టైరు పంక్చర్ అయింది. దీంతో భర్త రాజు టైరు విప్పి పంక్చర్ వేయించేందుకు వెళ్లాడు. నగదు ఉండటంతో శారద, పాపను కారులోనే కూర్చోపెట్టి వెళ్లాడు. ఇంతలోనే ఓ ఆగంతకుడు అక్కడికి వచ్చి.. కారుకు టైరు తీశారని, కిందపడే ప్రమాదం ఉందని, అందులోనుంచి దిగాలని శారదకు సూచించాడు. కారు పడిపోతుందేమో అనే కంగారులో ఆమె పాపతో సహా కారు దిగింది. తర్వాత కారులో సీటుపై పెట్టిన నగదు కవరు కనపడలేదు. తనను ఏమార్చిన ఆగంతకుడే నగదు పట్టుకెళ్లి ఉంటాడని సదరు మహిళ లబోదిబోమంటూ భర్త రాజుకు ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. అనంతరం దంపతులు పట్టణ పోలీసులు ఆశ్రయించి, నగదు చోరీ విషయమై ఫిర్యాదు చేశారు. అయితే దంపతులిద్దరూ బ్యాంక్ ఆఫ్ బరోడాలో బంగారం తాకట్టు పెట్టి నగదు తీసుకోవాన్ని గమనించిన దొంగ కావాలనే పంక్చర్ చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దొంగను పట్టుకునే పనిలో పోలీసులు ఉన్నట్లు చెప్పారు.

రహదారుల అభివృద్ధికి పెద్దపీట


రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


బషీరాబాద్: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: తాండూరు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి రూ.68 కోట్లతో అగ్గనూరు నుంచి బషీరాబాద్ మండలం వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రోడ్డు సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే యాలాల మండలంలోని కమాల్‌పూర్ నుంచి రాస్నం వరకు రోడ్డు విస్తరణ పనులను చురుగ్గా సాగుతున్నాయన్నారు. అగ్గనూరు నుంచి బషీరాబాద్ వరకు రోడ్డు విస్తరణ పనులు సైతం వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు భీమయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం, మాజీ సర్పంచ్ భీమప్ప, నాయకులు హన్మంతు, ఖాసీం, రఘురాంరెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, ప్రశాంత్, ఎల్లప్ప, సత్యనారాయణ, రఘు తదితరులు ఉన్నారు.

బషీరాబాద్: మండల పరిధిలో రూ.106 కోట్లతో బషీరాబాద్ మైల్వార్ రోడ్డుకు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్

ఇద్దరికి తీవ్రగాయాలు

దోమ: ట్రాక్టర్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మోత్కూర్ గ్రామానికి చెందిన సండి సాయి కుమార్, సండి ధన్‌రాజ్ స్వగ్రామం నుంచి పరిగి పట్టణానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మైలారం గేట్ సమీపంలోకి రాగానే ఖమ్మంనాచారం నుంచి వస్తున్న ఓ ట్రాక్టర్ గొడుగోనిపల్లి వైపు మళ్లుతుండగా వెనకనుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అటునుంచి వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఇరువురి పరిస్థితి విషమంగానే ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. కాగా ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. ఘటనా స్థలానికి ఆలస్యంగా వచ్చినట్లు సమాచారం.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

బషీరాబాద్: ఉరేసుకుని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్ తెలిపిన ప్రకారం.. గ్రామంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన నవీన్(28) హైదరాబాద్‌లోని ఓ సెలూన్ షాపులో పనిచేస్తున్నాడు. ఈయన తల్లిదండ్రులు చనిపోవడంతో పినతల్లి అంజిలమ్మతో కలిసి ఉండేవాడు. వారం క్రితం ఇంటికి వచ్చిన యువకుడు మరునాడు ఉదయం గది తలుపులు తెరవలేదు. దీంతో అనుమానం వచ్చి తలుపులు తెరచి చూడగా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే బలవన్మరణానికి కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రూప్ -2లో సత్తాచాటిన అనిల్



దోమ: నిరుపేద కుటుంబం.. తల్లిదండ్రులు చనిపోయారు.. అయినా పట్టుదలతో చదివి గ్రూప్ -2 ఫలితాల్లో 106వ ర్యాంక్ సాధించాడు దోమ మండలం బ్రాహ్మణపల్లి తండాకు చెందిన నేనావత్ అనిల్. ఎస్టీ కేటగిరిలో 4వ ర్యాంక్ పొందాడు. చక్కటి ప్రతిభ కనబరిచిన అనిల్‌ను గ్రామస్తులు అభినందించారు.

చికిత్స పొందుతూ ఉపాధ్యాయురాలి మృతి

కొత్తూరు: రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయురాలు మృతి చెందారు. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు... పట్టణంలో నివాసం ఉంటున్న జ్యోతి(40) స్థానికంగా ఉన్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తుంది. ఈ నెల 11న మధ్యాహ్నం పని నిమిత్తం పాఠశాల నుంచి ఇంటికి వెళ్లేందుకు జాతీయ రహదారిని కాలినడకన దాటే క్రమంలో మినీ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలవ్వడంతో పాఠశాల యాజమాన్యం, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ ఆమె బుధవారం మృతి చెందారు. ఈ సంఘటనపై పాఠశాల కరస్పాండెంట్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రూప్ ఫలితాల విడుదల అన్యాయం


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ

తాండూరు టౌన్: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేపట్టకుండా గ్రూప్ 1, 2, 3 ఫలితాలను విడుదల చేయడం అన్యాయమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కె.మల్లికార్జున్ మాదిగ అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది ఆగస్టు 1వ తేదీన ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణకు చట్ట బద్ధత కల్పిస్తామన్నారు. ఇచ్చిన నోటిఫికేషన్లలో ఎస్సీ వర్గీకరణ అమలయ్యేలా చూస్తానని మాట ఇచ్చారన్నారు. కానీ ఆ మాట నిలబెట్టుకోకుండానే గ్రూప్ 1, 2 ఫలితాలను ప్రకటించారన్నారు. ఇప్పటికైనా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి, వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు శివాజీ, మహేందర్, సూర్య ప్రకాష్, ఉమాశంకర్, పరశురాం, నవీన్, శివకుమార్, బస్వరాజు, సిద్ధు, రాము పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు అమ్మితే జైలుకే

మోమిన్‌పేట సీఐ వెంకట్


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వెంకట్

మోమిన్‌పేట: ప్రభుత్వం నిషేధించిన మత్తు పదార్థాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకొంటామని సీఐ వెంకట్ హెచ్చరించారు. బుధవారం మోమిన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మత్తు పదార్థాలు, గంజాయి తదితర వాటిని అమ్మిన, కొనుగోలు చేసిన కఠిన చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. కేటుగాళ్లు కొత్త మార్గాలను ఎంచుకొంటున్నారని తెలిపారు. ద్విచక్రవాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు. ముఖ్యంగా ఐపీఎల్ క్రికెట్ మ్యాచులు రానుండటంతో బెట్టింగ్‌లకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ అరవింద్ తదితరులు ఉన్నారు.

'కల్యాణలక్ష్మి'లో అక్రమాలు

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సీఐటీయూ నాయకుడు శ్రీనివాస్

బషీరాబాద్: కల్యాణలక్ష్మి పథకం అమలులో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ ఆరోపించారు. డబ్బులిస్తే అధికారులు అనర్హులకు పథకం అందేలా చూస్తున్నారని మండిపడ్డారు. మూడేళ్ల క్రితం మండలంలోని గొట్టిగకలాన్ గ్రామంలో బాలికకు పెళ్లి జరిగిందని, ఆమెకు 18 ఏళ్లు నిండాక వివాహం జరిగిందని అధికారులే తప్పుడు పత్రాలు సృష్టించారని ఆరోపించారు. ఈ విషయమై విచారణ చేయాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ వెంకటేశ్‌కు వినతిపత్రం అందజేశారు.

భగీరథ.. నీటివృథా!

చేవెళ్ల: మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు రంధ్రం పడి తాగునీరు వృథాగాపోవడంతో పాటు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇబ్రహీంపల్లి సమీపంలో బుధవారం కేబుల్ వైర్ల కోసం జేసీబీతో కాల్వ తీస్తుండగా భగీరథ ప్రధాన పైప్‌లైన్‌కు తగిలింది. దీంతో పైల్‌లైన్ ధ్వంసమై నీళ్లు ఎగిసి పడ్డాయి. రహదారి మొత్తాన్ని ఆక్రమించి వెదజిమ్మిన నీటితో ఈ రూట్‌లో రాకపోకలు సాగించిన ద్విచక్రవాహనదారులు తడిసి ముద్దయ్యారు. నీటి వృథాతో ఈప్రాంతమంతా బురదరమయమైంది. కొద్దిసేపటి తర్వాత మిషన్ భగీరథ అధికారులకు సమాచారం అందడంతో సరఫరాను నిలిపేశారు.


మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో రోడ్డుపైన వాహనాలపై పడుతున్న నీరు


ఇబ్రహీంపల్లి సమీపంలో మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజీ అయిన చోట పోతున్న నీరు